"పెద్దకథ"

# ప్రేమ పురాణం

-దీవి లక్ష్మీరాజేశ్వరి

(గత సంచిక తరువాయి)



'ఇవన్నీ పాతకాలంనాటి కబుర్లు సంజయ్ కాదు ఇమ్రాన్! ఇది వాస్తవం!'

'ఇదే నిజమైతే మరి మా అత్తయ్య ఎందుకని అలా ప్రవర్తిస్తుంది? ఆమె కూడా భారత వనితే కదా!' ఇమ్రాన్ మత్తులో మునిగి వున్నాడు.

'సులేమాన్‌గారి భార్య విషయమా ...?'

'అవును. పిచ్చి పెళ్ళాం ... మామయ్య ఓ పిచ్చోడు! భర్త పట్ల విబద్ధత అనేది ఎక్కడా, ఏకోశానా కనిపించదు ఆమెలో.'

'ఆమె ఏం చేసింది?'

'ఏం చేసిందా? మామయ్య జీవితాన్ని సర్వనాశనం చేసింది. మామయ్య ఆమె మీద ఎంత ప్రేమని కురిపిస్తూ వెళ్ళాడో, ఆమె అంతటి ద్వేషాన్ని వెలిగక్కుతూ వచ్చింది. ఆమెకోసం మామయ్య ఐశ్వర్యాన్ని మంచినీళ్ళప్రాయంలా వెచ్చించాడు. నీలోఫర్‌మహల్‌లో ఆమె సౌఖ్యం కోసం సమస్తం ఏర్పాటుచేశాడు. కానీ ఆమె నుంచి ఆయన పొందింది ఏమిటి? కేవలం ద్వేషం. తెలుసా మీకు?'

'దాని వెనుక ఏదో ఒక బలమైన కారణం తప్పనిసరిగా వుండి వుంటుంది.'

'కారణమా! ఒక్క వయస్సు తేడా తప్ప మరే కారణం లేదు. ఆమె వయస్సు పద్దెనిమిదీ-పంథొమ్మిదీ వుంటాయి. మామయ్య వయస్సు అప్పటికి నలభై అయిదు, యాభై మధ్య వుంటుంది.'

'ఇది అన్యాయం కదా?'

'అన్యాయం అయితే కావచ్చు. కానీ ఆ అన్యాయానికి బాధ్యుడు మామయ్య కాదు. మా నాన్న.'

'ఎలా?'

'ఈ సందర్భం కుదిర్చింది ఆయనే. మా నాన్న అప్పట్లో కలకత్తాలో వ్యాపారం చేసేవాడు. ఆయన బలవంతంగా మామయ్య పెళ్ళి కుదిర్చారు.'

'ఇది ఆయన మొదటి వివాహమా?'

'కాదు. రెండో పెళ్ళి. మొదటి భార్య కూతురు షాహీన్. ఆమె చనిపోయింది. వారసుని కనాలన్న బలహీనత కారణంగా ఆయన మా తండ్రిగారి మాటని కాదనలేకపోయారు.'

'ఇలాగే తప్పనిసరై తలవంచాల్సిన పరిస్థితి ఆమెకూ ఎదురై వుండవచ్చునుకదా!'

'ఉండవచ్చు.నేను కాదనను. ఈ సంబంధం విషయంలో ఆమె ఇంటి వాళ్ళకు చాలా పెద్దమొత్తం చెల్లించటం జరిగింది. పది లక్షల రూపాయిలు చెల్లించి ఈ సంబంధం కుదిర్చారు' ఇమ్రాన్ అలా చెప్పకుంటూ పోతున్నాడు.

పది లక్షలు!

పది లక్షలు అనే మాట అతని మస్తిష్కాన్ని అతలాకుతలం చేసింది. ధనరాశుల ముందు తన మాతృదేశ సభ్యత, సంస్కృతులు చెల్లాచెదరు కావటం అతని కళ్ళకు కట్టినట్లయింది. సంజయ్ సిగ్గుపడుతూ ఇమ్రాన్‌కేసి చూశాడు.

ఇమ్రాన్ విస్కీని గటగటా తాగేసి ఖాళీ గ్లాసును టేబుల్‌మీద పెట్టాడు.

క్లబ్బులో వున్నట్టుండి మళ్ళీ ఒక కొత్త సంగీత సముద్రం వెల్లువలా పైకి లేచింది.

వాతావరణం మళ్ళీ సరికొత్త సుగంధాలతో గుబాళించింది.

యువ జంటలు ఒకటొకటిగా డ్యాన్సింగ్ ఫ్లోర్ మీదికి చేరుకుని నాట్యం చేయటం ప్రారంభించాయి.

ఎక్కడ్నుంచి వచ్చిందో ఒక తూనీగలాంటి అమ్మాయి 'హాయ్' అంటూ ఇమ్రాన్ దగ్గరికి వచ్చింది.

ఇరువురూ పరస్పరం ఒకరి నడుంమీద మరొకరు చేతులు వేసుకుని డ్యాన్సింగ్ ఫ్లోర్ మీదికి వెళ్ళారు.

పాశ్చాత్య నృత్య సమ్మేళనంలో వీళ్ళూ ఒక భాగమయ్యారు.

టేబుల్ ముందు సంజయ్ ఒక్కడే కూర్చుని వున్నాడు. ఇమ్రాన్ మాటల్లోని ఒక వాక్యం అతని మస్తిష్కంలో పదే పదే ఆదేపనిగా మెదులుతోంది. 'పది లక్షల రూపాయిలు చెల్లించి ఈ సంబంధం కుదిర్చారు'

పది లక్షలు! పది లక్షలు!! పది లక్షలు!!!

సంజయ్ మత్తు మొత్తం దిగిపోయింది. ఇక అక్కడ ఒక్క క్షణం వుండబుద్ధి కాలేదు.

తెంబీ అక్కణ్ణుంచి లేచాడు.

క్లబ్ బయటికి నడిచాడు.

## 3

దట్టమయిన చీకట్లను చీల్చుకుంటూ కారు వేగంగా దూసుకుపోతోంది.

మెల్లమెల్లగా చీకట్లు పలచబడసాగాయి.

చూస్తూ చూస్తూండగానే వాతావరణం వింత వెలుగులతో శోభించసాగింది.

ఆకాశంలో అప్పుడే చంద్రోదయం అయింది.

చంద్ర కిరణాలు ఎడారి ఇసుక మీదికి ప్రసరించడంతో వెండిని పిండికొట్టి ఆరబోసినట్టుగా తయారయింది ప్రకృతి.

ఈ వెన్నెల రాత్రి కారు ప్రయాణం సంజయ్‌కి ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తోంది.


పగటిపూట వేడి గాడ్పులతో భయపెట్టే ఈ ఎడారులు వెన్నెల కాంతిలో ఇంతటి అపురూపమైన ఆహ్లాదాన్ని అందించటం వింతగా అనిపించింది సంజయ్‌కి.

'దావూద్! నీలోఫర్ మహల్ ఇక్కడికి ఎంత దూరం?' వున్నట్టుండి డ్రైవర్‌ని అడిగాడు సంజయ్.

'ఆ కనిపిస్తున్న కొండల మధ్యన వుంది సార్!' డ్రైవర్ దూరంగా కనిపిస్తున్న చిన్నికొండలకేసి చూపించాడు.

సంజయ్ కారులోంచి బయటికి తొంగిచూసి అటుకేసి దృష్టిని సారించాడు.

కారు ఆ ప్రదేశానికి సమీపంగా వచ్చేసింది.




సమీపంలోని చిన్నికొండమీద, ఖర్జూరపు చెట్ల మధ్య, అందమైన ఒక భవనం వెన్నెల కాంతిలో శోభాయమానంగా మెరిసిపోతూ కనిపించసాగింది.

ఆకాశ సరస్సు నుంచి ఒక అందమైన రాజహంస రెక్కలు ఆరబెట్టుకోవడానికి ఈ కొండ మీదికి దిగిందా అన్నట్టు వుంది ఆ పాలరాతి మందిరం.

కారు ఘాట్‌రోడ్డు ఎక్కింది.

కారు ముందుకు దూసుకుపోతున్న ఆ పాలరాతి మందిరం సమీపిస్తూ వుంది. మరింత స్పష్టంగా కనిపించసాగింది.

కారు మలుపు తిరిగి నీలోఫర్ మహల్ ప్రాంగణంలోకి ప్రవేశించింది.

కారు ఆపి హారన్ మోగించాడు డ్రైవర్.

వాచ్‌మేన్ దూరాన్నుంచి టార్చ్‌లైటువేసి 'ఎవరు?' అని బిగ్గరగా అరిచాడు.

'లఖన్‌సింగ్! మేమే! గేటు తీ!' అన్నాడు డ్రైవర్ దావూద్ పెద్ద గొంతుతో.

లఖన్‌సింగ్ వెంటనే దావూద్ కంఠస్వరం గుర్తుపట్టాడు. టార్చ్‌లైట్ వెలుగులో దావూద్ ముఖాన్ని కూడా చూశాడు. సంజయ్‌ని చూసి ఆ తర్వాత మళ్ళీ దావూద్ కేసి చూశాడు. లఖన్‌సింగ్ చూపులో ప్రశ్నార్థకం వుంది.

'వీరు సంజయ్! సులేమాన్‌గారి సెక్రటరీ!' అని చెప్పాడు దావూద్ అతని సందేహాన్ని నివృత్తిచేస్తూ.

లఖన్‌సింగ్ వినయంగా సంజయ్‌కి నమస్కరించి అతని చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు. సాదరంగా లోనికి ఆహ్వానిస్తూ 'ఇమ్రాన్ రాలేదా?' అని అడిగాడు.

'ఆయన ఒక అవసరమైన పని వుండి ఆగిపోయారు. తెల్లారేసరికల్లా వచ్చేస్తారు'. లఖన్‌సింగ్ వెంట అడుగులు వేస్తూ చెప్పాడు సంజయ్.

'మీరూ, ఇమ్రాన్‌గారూ కలిసి ఇక్కడికి వస్తారని సులేమాన్‌గారు ఫోన్‌చేసి చెప్పారు!'

'అలానా, ఆయన ఇంకేం చెప్పలేదా?' సంజయ్ జాగ్రత్తగా లఖన్‌సింగ్ చూపుల్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు.

'ఇదే చెప్పారు. మీ ఇద్దరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులూ జాగ్రత్తగా చూడమన్నారు. పనిమనుషుల్ని పెట్టి మొత్తం శుభ్రం చేయించమన్నారు.'

'మరి అన్నీ పూర్తయ్యాయా?'

'పూర్తయ్యాయి సార్! భోజనం సిద్ధంగా వుంది. కూలివాళ్ళు రేపు ఉదయం వచ్చేస్తారు'

లఖన్‌సింగ్ యజమానికి అతి విశ్వాసపాత్రుడైన నౌకరని తెలుసుకోవడానికి సంజయ్‌కి ఆట్టే సమయం పట్టలేదు.

'సార్! బంగళా తాళాలు తెచ్చారుగదా!' లఖన్‌సింగ్ ప్రశ్నతో ఏదో ఆలోచిస్తున్న సంజయ్ వాస్తవంలోకి వచ్చాడు.

'తెచ్చాను ... తెచ్చాను ... ఇదిగో' అంటూ వెంటనే జేబులోంచి తాళాలగుత్తి తీసి లఖన్‌సింగ్ చేతికి అందించాడు.

లఖన్‌సింగ్ ఆ తాళాన్ని ఎంతో ప్రేమగా నిమరసాగాడు. కనీసం కొద్ది క్షణాల పాటు నీలోఫర్‌మహల్‌కి తానే యజమాని అన్నట్టుగా ఫీలయ్యాడు.

లఖన్‌సింగ్ స్వామిభక్తి అటువంటిది.

దావూద్ కారును గారేజ్‌లో పెట్టాడు.

లఖన్‌సింగ్ వరండా మూలన వున్న మెయిన్ స్విచ్ ఆన్ చేశాడు. వెంట వెంటనే రెండు మూడు స్విచ్‌లు ఆన్ చేశాడు. దాంతో వరండా వెలుగులతో నిండిపోయింది.

సంజయ్ వరండాలోకి అడుగుపెట్టాడు.

లఖన్‌సింగ్ మహల్ ప్రధాన ద్వారం తెరిచాడు.

సంజయ్ మందిరం లోపలికి అడుగుపెట్టి వెంటనే వెనక్కి వచ్చేశాడు.

లోపల విపరీతమైన దుర్గంధం!

'రెండేళ్ళుగా పూర్తిగా మూతపడి వుండటంచేత లోపలికి అసలు గాలి పోకపోవడంతో దుర్గంధం వస్తోంది. కిటికీలు తెరిస్తే కొద్ది సేపట్లోనే ఈ దుర్గంధం పోతుంది" అంటూ లోపలి లైట్లు వేశాడు లఖన్ సింగ్.

విద్యుత్ కాంతులతో నిండిన హాలును చూసేసరికి కళ్ళు మిరుమిట్లుగొలిపినట్లయింది సంజయ్‌కి. హాలు వాతావరణం ఒక్కసారిగా జీవం పోసుకున్నట్లు అయింది.

నీలోఫర్‌మహల్ అందాలూ, అలంకరణలూ అతనిని దాదాపు పిచ్చివాణ్ణి చేశాయి. సులేమాన్ అభిరుచి అతనికి అణువణువునా కొట్టొచ్చినట్టు కనిపించసాగింది.

అక్కడి ఫర్నీచర్, ఇరాన్, కాశ్మీర్, చైనాల తివాచీలు, కిటికీలకు వేలాడుతూన్న పట్టు కర్టెన్లు, బెల్జియం షాండిలియర్లు హాలుకు నాలుగువేపులా అమర్చిన. పూలకుండీలు!

ఏదో ఒక గొప్ప స్వప్న సౌధంలోకి అడుగుపెట్టినట్టుంది సంజయ్‌కి.

'ఎలా వుంది నీలోఫర్ మహల్!' గర్వం ఉట్టిపడుతూన్న స్వరంతో అడిగాడు లఖన్‌సింగ్.

'అద్భుతంగా వుంది. దీన్ని పొగడగల శక్తిగల భాష నా దగ్గర లేదు. ప్రశంసలకు అతీతమైన అద్భుతమైన నిర్మాణం ఇది!'

'సులేమాన్‌గారు తన భార్య ఆనందంకోసం ఈ మందిరాన్ని నిర్మించారు. దీని అలంకరణకోసం ఆయన తన ఐశ్వర్యాన్ని మంచినీళ్ళప్రాయంలా వెచ్చించారు. కానీ అదృష్టం ఆయనకు కలిసిరాలేదు. విధి ఆయనను అన్యాయంగా వంచించింది' అంటూ గట్టి నిట్టూర్పు విడిచాడు. అక్కడి నుంచి మిగిలిన కిటికీలు కూడా తెరవటం ప్రారంభించాడు.

లఖన్‌సింగ్ చివరి వాక్యం సంజయ్ హృదయాన్నీ బాధపెట్టింది. తన యజమాని సులేమాన్ స్థితికి అతని హృదయం కరిగి నీరయ్యింది. రాణివాసం లాంటి ఈ పాలరాతి మందిరంలో స్వర్గసౌఖ్యాల్ని అనుభవించాల్సిన మనిషి పిచ్చాసుపత్రిలో పడి వుండటం ఎంత అన్యాయం అనిపించింది.

విధి వక్రిస్తే మనిషి కలలు ఎలా ముక్కలు ముక్కలైపోతాయో!

విధి బలీయం!

విధిని ఎదిరించే శక్తి మానవునికి రాదా?

మానవజాతి శాశ్వతంగా విధి చేతిలో కీలుబొమ్మలుగా కొనసాగవలసిందేనా?

తన విధిని తానే స్వయంగా విధించుకోగల స్థితికి మానవుడు చేరుకోలేడా?

గలగలమని శబ్దం వినిపించడంతో ఆలోచనల్లోంచి పూర్తిగా తేరుకున్నాడు సంజయ్.

కిటికీల్లోంచి హాల్లోకి ప్రవేశించిన తాజా గాలికి షాండిలేర్లు వూగటంతో ఏర్పడిన శబ్దం అది.

ఆ శబ్దం వాస్తవానికి జలతరంగిణిలా వుంది.

సంజయ్ మళ్ళీ సులేమాన్ అభిరుచులు, ఆకాంక్షలు, దురదృష్టాల గురించిన ఆలోచనల్లో జారిపోయాడు.

ఈలోపున లఖన్‌సింగ్ భవనంలోని గదులన్నింటిలోనూ లైట్లు వెలిగించాడు. అతనికి ఈరోజు చాలా ఆనందంగా వుంది. ఇన్ని రోజుల తర్వాత తిరిగి ఆ భవనం కాంతులీనటం అతని ఆనందానికి కారణం. ప్రతి గదినీ ఎంతో తన్మయత్వంతో చూడసాగాడు లఖన్‌సింగ్.

నీలోఫర్ మహల్ దాదాపు రెండేళ్ళుగా మూతపడి వుంది.

పైనున్న గది వున్నట్టుండి దేదీప్యమానం కావడంతో సంజయ్ దృష్టి అటుపడింది.

గులాబీ రంగుతో నిండివున్న ఆ గది. కింది నుంచే ఎంతో ఆకర్షణీయంగా వున్నట్టు కనిపించింది.

అనుకోకుండానే సంజయ్ కాళ్ళు ఆ గదికి తీసుకుపోయే మెట్లకేసి సాగాయి.

ఆ గది గుమ్మం ముందు వేలాడుతూన్న పట్టు పరదా గాలికి కదలాడసాగింది.

గది లోపల వెలుతురు ప్రవేశించడంతో అంధకారమయమైన ప్రదేశాన్ని లక్షలాది మిణుగురులు వెలుగుల్ని విరజిమ్మినట్లయింది.

లైట్లు వెలిగించి గదిలోంచి బయటికి వచ్చిన లఖన్‌సింగ్‌కి సంజయ్ ఎదురయ్యాడు.

'ఈ గది ఎప్పుడూ చీకటిగా వుంచరాదని సులేమాన్‌గారి ఆదేశం!' ఆనందంగా చెప్పాడు లఖన్‌సింగ్.

'ఎందుకని?' ఆశ్చర్యంగా అడిగాడు సంజయ్.

'ఇది ఆయన ప్రియపత్నిగారి గది – ఇది బేగం నీలోఫర్‌గారి గది.'

'బేగం నీలోఫర్!' ఆ పేరును పలికేటపుడు సంజయ్ పెదవులు హృదయం రెండూ ఒకేసారి కంపించాయి. అతను లఖన్‌సింగ్ కేసి అలా చూడసాగాడు.

లఖన్‌సింగ్ అవునని చెప్పి మెట్లు దిగసాగాడు.

కొద్ది క్షణాలపాటు నీలోఫర్ అనే పేరు సంజయ్ మనసునీ, మస్తిష్కాన్నీ ఒక్క కుదుపు కుదిపేసింది.

నీలోఫర్!

సులేమాన్ ప్రియపత్ని!!

ఆసుపత్రిపాలైన పిచ్చిది!!!

ఏదో బలమైన ఆకర్షణ నీలోఫర్ గదిలోకి అడుగుపెట్టమని ప్రోత్సహిస్తోంది సంజయ్‌ని. కానీ అతని పాదాలు నేలలోకి కూరుకుపోతున్నట్టుగా వుంది.

అంతుబట్టని ఒక వింత ఆందోళన!

సంజయ్‌కి ఎటూ పాలుపోవడంలేదు.

అతి కష్టంమీద జేబులోంచి సిగరెట్టు పెట్టెతీసి ఒక సిగరెట్టును వెలిగించుకోగలిగాడు. సిగరెట్ కాల్చాక మనసు కాస్తంత స్థిమితపడినట్టు అయింది.

గుమ్మం ముందు వేలాడుతున్న పట్టు పరదాకేసి మరోసారి చూశాడు సంజయ్.

గదిలోంచి ఆ సన్నని తెరను దాటి మిలమిలలాడుతున్న కాంతి కొద్ది కొద్దిగా తొంగిచూస్తోంది.

ఒకనాడు తన నుంచి దూరమై అఖాధాల్లోకి అంతర్ధానమైన అద్భుతకాంతి, తన ప్రేమకాంతి ఆ గదిలోనే బందీ అయిందా అనిపించింది సంజయ్‌కి.

ఈమె తాను కోల్పోయిన నీలోఫర్ కాదుగదా!?

నీలోఫర్!

తన ప్రేయసి!!

తన కనుల కాంతి!!!

తన హృదయ శాంతి!!!!

తన ప్రాణం, తన హృదయం, తన సర్వస్వం అయిన నీలోఫర్ ఏమయింది?

ఏ దూరతీరాలకు వెళ్ళిపోయింది?

ఇంతకీ ఈ నీలోఫర్ ఎవరు?

ప్రశ్నలు! ప్రశ్నలు!! ప్రశ్నలు!!!

తల దిమ్మెక్కిపోతోంది సంజయ్‌కి.

అతని పాదాలు అతని ప్రమేయం లేకుండానే ముందుకు అడుగులు వేశాయి.

సంజయ్ చేతులు తెరని తొలగించాయి.

సంజయ్ దివ్య హర్మ్యంలోని అద్భుతమైన ఆ గదిలోకి అడుగుపెట్టాడు.

అతని కళ్ళు ఆ దృశ్యాన్ని చూసి నమ్మలేకపోయాయి.

ఒక్కసారిగా అతని శరీరం కొయ్యబారినట్టు అయిపోయింది.

అతని శరీరంలో, నరాల్లో, ధమనుల్లోంచి ప్రవహిస్తున్న రక్తం ఒక్కసారిగా గడ్డ కట్టుకుపోయినట్లయింది.

తాను అనుకున్నదే నిజమయింది!

తన ప్రాణం, తన హృదయం, తన సర్వస్వం ఆ నీలోఫర్! ఆమే! ఆమే స్వయంగా అతనిముందు నిలబడి వుంది!

ఎదురుగా వున్న గోడమీద అలంకరించబడిన నీలోఫర్ నిలువెత్తు చిత్రపటాన్ని చూసేసరికి సంజయ్‌లో అప్పటివరకూ ముడుచుకుని వున్న మనిషి మేల్కొన్నాడు.

ఆ మేల్కొన్న మనిషి కేవలం మేల్కొన్న మనిషి కాదు!

అతను నిలువునా గాయపడిన మనిషి!

అసంపూర్ణ అసంతృప్త క్షతగాత్రుడు ఆ మనిషి! — సశేషం

